సాక్షి ఖమ్మం

మంగళవారం । 25 । ఫిబ్రవరి । 2025



శివపూజకు వేళాయె...

మహాశివరాత్రి పర్వదినానికి జిల్లాలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు, కల్యాణ వేడుకలకు ఏర్పాట్లు పూర్తిచేశారు.

8లో



కొనసాగుతున్న టెన్నిస్ టోర్నీ

ఖమ్మం పటేల్ స్టేడియంలో ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నీ కొనసాగుతుండగా మంగళవారం ప్రీ క్వార్టర్ ఫైనల్స్ జరగనున్నాయి.

8లో

గరిష్టం / కనిష్టం
35° / 19°

వాతావరణం

జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. ఉదయం, రాత్రి మాత్రం చలి ప్రభావం కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్, పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన సంబంధిత అధికారులతో సమావేశమై సూచనలు చేశారు. ఇంటర్ పరీక్షలకు 72, పదో తరగతి పరీక్షలకు 97 కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ప్రశ్నాపత్రాల తరలింపు సమయాన తప్పనిసరిగా పోలీస్ ఎస్కార్ట్ ఏర్పాటుచేయాలని, కేంద్రాల్లో తాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లే కాక పారా మెడికల్ సిబ్బంది ద్వారా మందులు అందుబాటులో ఉంచాలని చెప్పారు. కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేయాలని సూచించారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, డీఈఓ సోమశేఖరశర్మ, డీపీఓ ఆశాలత, వివిధ శాఖల అధికారులు సురేందర్, డాక్టర్ కళావతిబాయి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ సాయం

ఖమ్మంవ్యవసాయం: కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పథకం 19వ విడత నిధులు సోమవారం అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయి. పంట పెట్టుబడి సాయంగా ఏటా రూ.6వేలను రూ.2వేల చొప్పున కేంద్రప్రభుత్వం మూడు విడతలుగా అందిస్తోంది. ఈ ఏడాది తొలి విడత నిధులను విడుదల చేసింది. జిల్లాలో ఈ పథకం కింద అర్హులైన రైతులు 1.60 లక్షల మంది ఉండగా వీరి ఖాతాల్లో యాసంగి పెట్టుబడి సాయం కోసం రూ.2వేల చొప్పున జమ చేశారు.

తపాలా సేవలపై డాక్ అదాలత్

ఖమ్మంగాంధీచౌక్: తపాలా సేవల్లో సమస్యలు తెలుసుకునేందుకు వచ్చేనెల 25న డాక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఖమ్మం డివిజన్ తపాలా సూపరింటెండెంట్ వీరభద్ర స్వామి తెలిపారు. సర్వీసులకు సంబంధించి సమస్యలు ఎదుర్కొంటున్న వారు మార్చి 7వ తేదీ నాటికి అందేలా పంపించాలని సూచించారు. ఉద్యోగుల సమస్యలు, కోర్టులో ఉన్న అంశాలు కాకుండా ఇతర సమస్యలను '49వ డాక్ అదాలత్, కె.శ్రీకాంత్, అసిస్టెంట్ డైరెక్టర్(స్టాఫ్ అండ్ విజిలెన్స్), పోస్టుమాస్టర్ జనరల్, హైదరాబాద్ రీజియన్, హైదరాబాద్-500001' చిరునామాకు చేరేలా పంపించాలని తెలిపారు.

ఎమ్మెల్సీ పోలింగ్ వేళ ఆంక్షలు

ఖమ్మంక్రైం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈనెల 27న జరగనుండగా ఖమ్మం కమిషనరేట్ పరిధిలో రెండు రోజుల పాటు మద్యం విక్రయాలను నిలిపివేయాలని సీపీ సునీల్‌దత్ ఓ ప్రకటనలో ఆదేశించారు. వైన్స్, బార్లు, క్లబ్‌లను మంగళవారం సాయంత్రం 4గంటల నుంచి 27వ తేదీ సాయంత్రం 4గంటల వరకు బంద్ చేయాలని, ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, ఆంక్షల దృష్ట్యా ఐదుగురు కంటే ఎక్కువ మంది గుంపులుగా తిరగొద్దని, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, కవ్వింపు చర్యలకు పాల్పడొద్దని తెలిపారు. డబ్బు, మద్యం, కానుకల ద్వారా ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామని సీపీ చెప్పారు. పోలింగ్ సందర్భంగా ఓటర్లకు భద్రతాపరంగా సమస్యలు ఎదురైతే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

■ సదరం సర్టిఫికెట్ ఉన్నా..



ఈమె కొణిజర్ల మండలం పల్లిపాడుకు చెందిన వల్లమాని కుమారి. దివ్యాంగురాలైన కుమారి భర్త చనిపోవడంతో వితంతు పింఛన్ అందుతోంది. కొంతకాలం తర్వాత మరొకరిని వివాహం చేసుకుంది. ఆమె దివ్యాంగురాలు కావడంతో ఆరేళ్ల క్రితం 50 శాతం వైకల్యంతో సదరం సర్టిఫికెట్ వచ్చింది. దీంతో వితంతు పింఛన్ కాకుండా దివ్యాంగుల పింఛన్ ఇప్పించాలని వైరాలోని మున్సిపల్ కార్యాలయం, కొణిజర్ల మండల కార్యాలయాలకు పలుమార్లు వెళ్లింది. అయినా సమస్య పరిష్కారం కాక ఆరేళ్లుగా ఎవరూ పట్టించుకోవడం లేదంటూ కలెక్టరేట్‌కు వచ్చింది.

■ కనికరించడం లేదు..



ఏన్కూరు మండలం రాజలింగాలకు చెందిన బండి రాజమ్మకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు బండి భిక్షానికి వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే, పదిహేనేళ్లుగా బండి భిక్షం అరుదైన వ్యాధితో బాధపడుతుండడంతో కాసేపు కూడా నిల్చునే పరిస్థితి లేదు. పనికి వెళ్లలేక కుటుంబ పోషణ భారం ఆయన భార్యపై పడింది. దీంతో భిక్షంకు పింఛన్ ఇప్పించాలని సదరమ్ క్యాంపుకు వెళ్తే అర్హత లేదని తిరస్కరించారని ఆయన తల్లి వాపోయింది. ఈమేరకు అధికారులు స్పందించాలని కోరుతూ ప్రజావాణిలో కుమారుడితో కలిసి దరఖాస్తు ఇచ్చింది.

ప్రజావాణీ.. గోడు వినరేమి?

కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌కు పదేపదే పాత సమస్యలే

- క్షేత్రస్థాయిలో పరిష్కారం లేక మళ్లీ ఫిర్యాదులు
- ఎవరిని కదిలించినా దీన గాథలు, కన్నీటి సుడులు



ప్రజావాణిలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, డీఆర్వో పద్మశ్రీకి సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి ప్రదక్షిణ కేంద్రంగా మారింది. ఇక్కడ విజ్ఞప్తులు ఇస్తున్న వారిలో అత్యధికంగా రెండు లేదా మూడో సారి వస్తున్న వారే ఉంటున్నారు. క్షేత్ర స్థాయిలో సమస్యలు పరిష్కారం కాక మళ్లీ బాధితులు కలెక్టరేట్ బాట పడుతున్నారు. అన్ని పత్రాలు ఉన్నా పింఛన్ రాకపోవడం, భూ సంబంధిత సమస్యలు, రుణమాఫీ, వృద్ధాప్యంలో కుమారులు, కుమార్తెలు పట్టించుకోవడం లేదని.. ఇలా ఒక్కొక్కరు ఒక్కో సమస్యపై విన్నవిస్తున్నారు. మండల స్థాయి మొదలు కలెక్టరేట్ వరకు పలుమార్లు ఫిర్యాదు ఇచ్చినా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని గోడు వెళ్లబోసుకుంటున్నారు.

శాఖల వారీగా సమీక్షిస్తూ..

సమస్యలపై వినతిపత్రాలు, దరఖాస్తులు ఇచ్చేందుకు వస్తున్న వారితో ప్రతీ సోమవారం కలెక్టరేట్ కిక్కిరిసిపోతోంది. కలెక్టర్, అదనపు కలెక్టర్లు, రెవెన్యూ, ఇతర శాఖల జిల్లా అధికారులు హాజరవుతుండడంతో కొన్ని సమస్యలు అప్పటికప్పుడే పరిష్కారమవుతున్నాయి. అయితే కొన్ని దరఖాస్తులను క్షేత్ర స్థాయి పరిశీలనకు పంపిస్తుండగా నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. సమస్య పరిష్కారం కాకపోగా దరఖాస్తు ఏ స్థాయిలో ఉందనే సమాచారం కూడా బాధితులకు తెలియడం లేదు. దీంతో వారు మళ్లీ కలెక్టరేట్ మెట్లు ఎక్కుతున్నారు. రెండు.. మూడు సార్లు ప్రజావాణికి వచ్చినా సమస్య పరిష్కారం కావడం లేదని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొన్ని తగ్గినా.. ఇంకొన్ని పాతవే

ఇటీవల ప్రభుత్వం రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల స్థలాలు, ఇళ్ల కోసం ప్రజాపాలన సభల ద్వారా దరఖాస్తులు స్వీకరించింది. దీంతో ఈ అంశాలపై వినతులు ప్రజావాణిలో తగ్గాయి. అలాగే, భూ సంబంధిత సమస్యలపై కలెక్టరేట్, మండల రెవెన్యూ కార్యాలయాల్లో ధరణి హెల్ప్ డెస్క్‌లు పెట్టడంతో ఈ సమస్యలు కూడా అందడం లేదు. కానీ వ్యవసాయ భూములు, ఇంటి స్థలాలను ఆక్రమించుకున్నారని, ఒకే సర్వే నంబర్ అయితే మరో సర్వే నంబర్ చూపిస్తోందని తదితర అంశాలపై ఫిర్యాదులు వస్తున్నాయి. సదరం సర్టిఫికెట్ ఉన్నా పింఛన్ రావడం లేదని, దివ్యాంగులమైనా సదరం సర్టిఫికెట్ ఇవ్వడం లేదని కొందరు.. ఆస్తి విషయంలో తగవు పడి కుమార్తెలు, కుమారులు తమను పట్టించుకోవడం లేదని పండుటాకులు గోడు వెళ్లబోసుకుంటున్నారు. ఇలాంటి కొన్ని అంశాలపై వినతులు మళ్లీమళ్లీ వస్తుండడంతో అధికారులు క్షేత్ర స్థాయి యంత్రాంగానికి పంపిస్తుండడంతోనే సరిపోతోంది.

■ నా భూమి నాకు ఇప్పించండి..



రేపాల రవి

ఖానాపురంలోని సర్వే నంబర్ 93లో కొనుగోలు చేసిన స్థలాన్ని కొందరు ఆక్రమించుకున్నారని, తన భూమిని తనకు ఇప్పించాలంటూ రేపాల రవి ప్రజావాణిలో వినతిపత్రం ఇచ్చాడు. ఈ విషయమై పలుమార్లు మండల స్థాయి అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని వాపోయారు. ఎల్ఆర్ఎస్‌లోనూ తమ స్థలాన్ని సర్వే నంబర్ 93లో చూపారని, అయినా ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

■ రుణమాఫీ ఇంకెప్పుడు?



చావా శరత్

టేకులపల్లిలోని ఆంధ్రాబ్యాంక్ కర్షక సేవా సహకార సంఘం పరిధిలో ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, ముదిగొండ, నేలకొండపల్లి మండలాలకు చెందిన 7 వేల మంది రైతులు ఉన్నారు. ఇందులో చాలా మందికి రుణమాఫీ కాలేదని పలువురు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సంఘాన్ని దత్తత తీసుకున్న ఓ బ్యాంకు పరిమిత సంఖ్యలో జాబితా పంపడంతో ఈ పరిస్థితి నెలకొందని గోకినేపల్లికి చెందిన రైతు చావా శరత్ వాపోయారు. ఇటీవల మళ్లీ ఆడిట్ చేసి 1,263 మంది రైతులకు రూ.13కోట్లు మాఫీ చేయాలని ప్రభుత్వానికి జాబితా పంపినందున చొరవ చూపాలని కోరారు.

సాగునీరు వృథా కానివ్వొద్దు

- అన్ని శాఖల సమన్వయంతో చివరి ఆయకట్టు వరకూ సరఫరా
- పెనుబల్లి మండలంలో పర్యటించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



టేకులపల్లిలో పొలాలను పరిశీలించడానికి వెళ్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెనుబల్లి: రబీ పంటలకు సరిపడా నీరు అందేలా అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. తద్వారా చుక్క నీరు కూడా వృథా కాకుండా చివరి భూములకు సైతం సరఫరా చేయాలని తెలిపారు. పెనుబల్లి మండలం టేకులపల్లిలో సాగు చేస్తున్న పంటలను సోమవారం ఆయన పరిశీలించారు. వ్యవసాయ, నీటిపారుదల, రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారులతో కలిసి పర్యటించిన కలెక్టర్ ఎండలు పెరుగుతుండడం, ఇదే సమయాన పంటలకు నీరందించడం కీలకమైనందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వారబందీ విధానంలో చివరి ఆయకట్టు వరకు నీరు అందించేలా పర్యవేక్షించాలని సూచించారు. వ్యవసాయాధికారి ఏవీఎస్ఎస్.రాజు, ఐబీ జేఈలు కిరణ్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

ధైర్యంగా పరీక్షలకు సిద్ధం కావాలి

పెనుబల్లి: పదో తరగతి విద్యార్థులు పరీక్షలు అంటే భయపడకుండా ధైర్యంగా సిద్ధం కావాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. టేకులపల్లిలోని మోడల్ స్కూల్‌ను తనిఖీ చేసిన ఆయన పాఠశాలలో సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం పథకం అమలుపై ఆరా తీశారు. తరగతి గదుల్లో బెంచీలు సరిగ్గా లేవని విద్యార్థులు చెప్పగా సమకూరుస్తామని తెలిపారు. అనంతరం పదో తరగతి గది విద్యార్థులకు ఆయన సాంఘిక శాస్త్రంలో పాఠం బోధించి ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున ఒత్తిడి లేకుండా ప్రణాళికాయుతంగా చదవడం ద్వారా మెరుగైన మార్కులు సాధించాలని కలెక్టర్ సూచించారు.

కృష్ణా జలాల విషయంలో కేంద్రం జోక్యం చేసుకోవాలి



రాజీవ్ కెనాల్ పనులను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఏన్కూరు: కృష్ణా జలాల పంపకం విషయంలో కేంద్రప్రభుత్వం జోక్యం చేసుకుని ఇరు రాష్ట్రాలకు తగినట్లుగా కేటాయించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఏన్కూరు మండలం హిమాంనగర్ సమీపాన సీతారామ ప్రాజెక్ట్, రాజీవ్ లింక్ కెనాల్ పనులను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కృష్ణా జలాల్లో రాష్ట్రాల వాటాలను కేంద్రం తక్షణమే తేల్చి తెలంగాణకు రావాల్సిన వాటా విడుదల చేయాలన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల పరిధిలో ఎక్కువ నీటిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వాడుకుందని, తద్వారా తెలంగాణకు తీవ్ర నష్టం వాటిల్లనుందని తెలిపారు. నీటి వాటాలను తేల్చుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నందున రాష్ట్ర రైతులు నష్టపోకముందే కేంద్రం స్పందించాలని కోరారు. కాగా, లింక్ కెనాల్ పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించిన మంత్రి, కెనాల్ తవ్వకానికి భూములు ఇచ్చిన రైతులకు తగిన నష్టపరిహారం త్వరలో అందజేస్తామని తెలిపారు.

ఖమ్మం మార్కెట్‌కు మూడు రోజుల సెలవులు

ఖమ్మంవ్యవసాయం: మహాశివరాత్రి, అమావాస్య నేపథ్యాన ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం నుంచి మూడు రోజుల సెలవులు ప్రకటించారు. ఈనెల 26న బుధవారం మహాశివరాత్రి, 27న గురువారం జాగారం సెలవుతో పాటు 28న శుక్రవారం అమావాస్య సందర్భంగా సెలవు ప్రకటించినట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అయితే, శనివారం వారాంతపు సెలవైనా మిర్చి కొనుగోళ్లు నిర్వహిస్తామని, రైతులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన సోమవారం ఓ ప్రకటనలో కోరారు.

మతసామరస్యానికి ప్రతీకగా నిలపాలి

పోలీసు కమిషనర్ సునీల్‌దత్



ముస్లిం మత పెద్దలతో సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: జిల్లాను మత సామరస్యానికి ప్రతీకగా నిలిపేలా అందరూ సహకరించాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ సూచించారు. వచ్చేనెల 2వ తేదీ నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం కానుండగా ఆయన ముస్లిం మతపెద్దలు, మసీద్‌ల ఇన్‌చార్జ్‌లతో సోమవారం సమావేశమయ్యారు. అన్ని మతాల వారు సోదరభావంతో మెలగడం జిల్లాలో సంప్రదాయంగా వస్తోందని, ఇదే స్ఫూర్తితో రంజాన్ ఉపవాస దీక్షలు జరుపుకోవాలని కోరారు. సమస్యలు తలెత్తకుండా పోలీసు శాఖ తరఫున సహకరిస్తామని, ఏమైనా ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని సీపీ సూచించారు. ఈసమావేశంలో అడిషనల్ డీసీపీ ప్రసాద్ రావు, ఏసీపీ రమణమూర్తి, ఖమ్మం వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్, ఎస్ఐ మౌలానా తదితరులు పాల్గొన్నారు.

ఏఐతో విద్యార్థుల్లో కనీస సామర్థ్యాల పెంపు

ల్యాబ్‌ను ప్రారంభించిన డీఈఓ సోమశేఖరశర్మ



విద్యార్థుల పరిజ్ఞానాన్ని పరిశీలిస్తున్న డీఈఓ శర్మ

నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో కనీస అభ్యర్థన సామర్థ్యాలను పెంచేలా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ తెలిపారు. మండలంలోని సింగారెడ్డిపాలెం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఏఐపై బోధించేలా ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇచ్చామని తెలిపారు. తొలి విడతగా ఉమ్మడి జిల్లాలోని 12 పాఠశాలల్లో ఇంటర్నెట్ సౌకర్యంతో కూడిన ఐదేసి కంప్యూటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థుల్లో చదవడం, రాయడం, లెక్కలు చేయడం వంటి కనీస సామర్థ్యాలు పెంచేందుకు ఈ ల్యాబ్‌లు ఉపయోగపడతాయని, దశల వారీగా అన్ని పాఠశాలల్లో వీటిని అమలుచేసే అవకాశముందని తెలిపారు. విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి రవికుమార్, హెచ్‌ఎంలు గోపగాని రమేష్, హరి శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ బి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రబంగారం కళకళ !



మిర్చి బస్తాలతో నిండిపోయిన మార్కెట్ ఆవరణ

- ఖమ్మం మార్కెట్‌కు 1.20లక్షల మిర్చి బస్తాలు
- పంట కోతలు జోరందుకోవడంతో పెరిగిన విక్రయాలు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ సోమవారం మిర్చి బస్తాలతో కళకళలాడింది. మార్కెట్‌కు దాదాపు 1.20 లక్షల మిర్చి బస్తాలను రైతులు విక్రయానికి తీసుకొచ్చినట్లు అధికారులు వెల్లడించారు. శని, ఆదివారం మార్కెట్ సెలవు కావడంతో ఆదివారం రాత్రి నుంచే వాహనాల్లో మిర్చి బస్తాలను తీసుకురాగా యార్డు నిండిపోయింది. దీంతో పత్తి యార్డును కూడా మిర్చి క్రయ విక్రయాలకు కేటాయించారు. మిర్చి కోతలు ముమ్మరంగా సాగుతుండడంతో విక్రయాలు పెరిగినట్లు భావిస్తున్నారు. కాగా, పంట కొనుగోళ్లు, కాంటాలు, తోలకాల్లో ఆలస్యం జరగకుండా అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

రెండో కోత కావడంతో..

మిర్చిని మూడు కోతలుగా విభజిస్తారు. ఇందులో మొదటి కోతలో ఎక్కువగా మైల కాయ రాగా, రెండో కోత వచ్చే కాయలు నాణ్యతగా ఉంటాయి. ప్రస్తుతం రెండో కోత సాగుతున్న నేపథ్యాన అధికంగా విక్రయానికి తీసుకొస్తున్నారు. 'తేజా' రకం కొనుగోళ్లలో ఖమ్మం మార్కెట్‌కు పేరు ఉండడంతో ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ నుంచే కాక మహబూబాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాలతో పాటు ఏపీలోని ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల రైతులు సైతం మిర్చి తీసుకొచ్చారు.

ధరతో దిగాలు

ఊహకందని విధంగా ఈ ఏడాది మిర్చి ధర పతనం కావటం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. గత ఏడాది క్వింటాకు రూ.23 వేల మేర ధర పలకగా ఈ ఏడాది రూ.13వేలకు పడిపోయింది. సోమవారం ఖమ్మం మార్కెట్‌లో జెండాపాట ధర రూ.14,125గా, మోడల్ ధర రూ.13,600గా, కనిష్ట ధర రూ.6వేలుగా నమోదైంది. తాలు మిర్చి గరిష్టంగా రూ.6,500,, మోడల్ ధర రూ.6వేలు, కనిష్ట ధర రూ. 5,200గా పలికింది.

క్లుప్తంగా

ముగ్గురు జవాన్ల వేతనంలో కోత

పారిశుద్ధ్య నిర్వహణలో లోపంపై కమిషనర్ ఆగ్రహం



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ లోపిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య హెచ్చరించారు. ఖమ్మం 22, 27, 32, 33, 36వ డివిజన్లలో సోమవారం పర్యటించిన ఆయన రహదారులు, డ్రెయినేజీలను పరిశీలించి శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లతో మాట్లాడారు. పనుల వారీగా, ట్రాక్టర్లపై ఎందరు కార్మికులను కేటాయిస్తున్నారని ఆరా తీశారు. కాగా, 32, 33, 36వ డివిజన్లలో రోడ్డు వెంట చెత్త కుప్పలు, చెట్ల కొమ్మలు ఉండడాన్ని గమనించిన ఆయన ముగ్గురు జవాన్లకు రెండు రోజుల వేతనం కోత విధించాలని శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్యను ఆదేశించారు. అలాగే, 28వ డివిజన్‌లోని ఓ కోల్డ్ స్టోరేజీ నిర్వాహకులు వ్యర్థాలను ఖాళీ స్థలంలో వేయడంపై స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో శానిటరీ సూపర్‌వైజర్, సిబ్బంది పరిశీలించి కోల్డ్ స్టోరేజీ నిర్వాహకులకు రూ.10 వేల జరిమానా విధించారు.

నిరుపేద విద్యార్థికి రూ1.03 లక్షల సాయం



నిశాంత్‌కు చెక్కు అందజేస్తున్న రామారావు

కల్లూరు: పెనుబల్లి మండలం కర్రాలపాడుకు చెందిన జినుగు శ్రీనివాసరావు – రాధిక కుమారుడు నిశాంత్ కొత్తగూడెం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అయితే, వీరికి నిరుపేద కుటుంబం కావడంతో ఫీజు, ఇతర ఖర్చుల నిమిత్తం స్ఫూర్తి ఫౌండేషన్ ద్వారా ప్రతినిధి వరకా రామారావు నిశాంత్‌కు సోమవారం రూ.1,03,000 చెక్కును సోమవారం కల్లూరులో అందజేశారు.

పత్తి కొనుగోళ్లకు ప్రత్యేక ఏర్పాట్లు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మార్కెట్‌కు లక్షకు పైగా మిర్చి బస్తాలు వస్తుండడంతో మిర్చితో పాటు పత్తి యార్డును సైతం కొనుగోళ్లకు కేటాయించారు. ఇదే సమయాన అదనపు యార్డులో అధునాతన మిర్చి యార్డు నిర్మాణ పనులు జరుగుతుండగా పత్తి కొనుగోళ్లకు ఆటకం ఏర్పడుతోంది. దీంతో నిర్మాణాలు జరుగుతున్న యార్డులో ఓ భాగాన్ని పత్తి కొనుగోళ్లకు కేటాయించి షేడ్ నెట్‌తో హద్దులు ఏర్పాటుచేశారు. సోమవారం నుంచి ఈ ప్రాంగణంలో పత్తి కొనుగోళ్లు చేపడుతుండగా, మిర్చి యార్డుపై ఒత్తిడి తగ్గే వరకు కొనసాగిస్తామని మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

నేటి బాలలదే రేపటి సమాజం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న బిషప్ ప్రకాశ్

తల్లాడ: నేటి బాలలే రేపటి పౌరులని, వారిపైనే సమాజ భవిష్యత్ ఆధారపడి ఉందని ఖమ్మం మేత్రాసనం పీఠాధిపతి సగిలి ప్రకాశ్ అన్నారు. తల్లాడ మండలం రెడ్డిగూడెం క్రీస్తు జ్యోతి కళాశాలలో సోమవారం 17 పాఠశాలల విద్యార్థులకు నృత్య పోటీలు నిర్వహించగా విజేతలకు ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. విద్యార్థులు సరైన లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకు కృషి చేయకపోతే భవిషత్‌లో సమస్యలు ఎదురవుతాయన్నారు. ఈమేరకు బాధ్యత కలిగిన పౌరులుగా క్రమశిక్షణ పాటిస్తూ ఎదగాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ థామస్, జ్యస్టీన్స్, ప్రదీప్‌రెడ్డి, శ్రీకాంత్, రాజేష్, రవి, జోసఫ్, జస్టిన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ఠ	కనిష్ఠ
పెసలు	6,500	6,500
పత్తి	6,900	5,500
ఏసీ మిర్చి	14,125	6,000
తాలు మిర్చి	6,500	5,200

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,487

శివపూజకు వేళాయె..



మహాశివరాత్రికి అంతా సిద్ధం

- పరమశివుడి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- ప్రత్యేక పూజలు, కల్యాణానికి సిద్ధం
- భక్తుల కోసం శివాలయాల్లో క్యూలైన్లు, షామియానాలు

ఊరూరా ఉన్న శివాలయాల్లో బుధవారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నిర్వహించే ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. చారిత్రక నేపథ్యం ఉన్న ఆలయాలే కాకుండా అన్ని శివాలయాల్లో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేశారు. ఖమ్మం రూరల్ మండలం తీర్థాలలోని సంగమేశ్వరాలయం సహా పలు ఆలయాల్లో మూడు రోజుల పాటు జరిగే జాతరలకు వేలాదిగా భక్తులు హాజరుకానున్నారు.

వేడుకలకు సిద్ధమైన నీలాద్రీశ్వరాలయం



నీలాద్రీశ్వరుడు

పెనుబల్లి: పెనుబల్లి మండలం భవన్నపాలెం అటవీప్రాంతంలో మహాశివుడు కొలువైన నీలాద్రీశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు పూర్తిచేశారు. స్వయంభుగా వెలిసిన నీలాద్రీశ్వరుడు కాకతీయుల కాలం నుండి పూజలందుకుంటున్నాడు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు ఏపీలోని కృష్ణా, తదితర జిల్లాల నుండి సుమారు లక్షన్నర మందికి పైగా భక్తులు హాజరవుతారనే అంచనాతో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు సత్తుపల్లి రూరల్ సీఐ ఎం.ఎల్.ముత్తిలింగయ్య తెలిపారు. అలాగే, భక్తుల పుణ్యస్నానాల కోసం కోనేరును స్వచ్ఛమైన నీటితో నింపగా క్యూలైన్లు, ఇతర ఏర్పాట్లు చేసినట్లు ఈఓ పాకాల వెంకటరమణ వెల్లడించారు. అంతేకాక ఆలయ ఆవరణలో మృత్యుంజయ యాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కాశ్మీర మహాదేవ క్షేత్రంలో మూడు రోజుల జాతర

కల్లూరు: మహాశివరాత్రి సందర్భంగా కల్లూరులోని శ్రీ కాశ్మీర మహాదేవ క్షేత్రం(కల్లూరు అప్పయ్య శివాలయం) ముస్తాబైంది. కాకతీయుల కాలంలో వెలిసినట్లు నమ్మే ఈ ఆలయంలోని లింగాకారంలో ఉన్న స్వామికి అభిషేకం చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మిక. ఆలయం కొన్నాళ్ల క్రితం శిథిలావస్థకు చేరగా దేవాదాయశాఖ ఆధ్వర్యాన భక్తులు, కాకతీయ షుగర్ అండ్ సెమెంట్ ఇండ్రస్ట్రీస్ సహకారంతో జీర్ణోద్ధరణ చేశారు. ఈ ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పార్వతీ పరమేశ్వర కల్యాణోత్సవాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ మేనేజర్ ఎస్‌వీడీ.ప్రసాద్, ఆలయ కమిటీ చైర్మన్ మాడిశెట్టి వెంకటేష్ తెలిపారు.



కల్లూరులోని శ్రీ కాశ్మీర మహాదేవ క్షేత్రం

శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో..



లక్ష్మీపురంలోని రామలింగేశ్వర స్వామి ఆలయం

వైరారూరల్: వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలోని పురాతన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 26న మహాశివరాత్రి సందర్భంగా జరిగే జాతర ఏర్పాట్లు చివరి దశకు చేరాయి. స్వామి దర్శనానికి వేలాదిగా భక్తులు హాజరుకానుండంతో ప్రత్యేక పార్కింగ్ స్థలాన్ని ఏర్పాచేయగా, ఆలయానికి రంగులు వేసి ముస్తాబు చేశారు. అలాగే, చలువ పందిళ్లు, క్యూ లైన్లు సిద్ధమయ్యాయి. మహాశివరాత్రి రోజున జరిగే పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దంపతులు పీటలపై కూర్చుంటారని ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు.

తీర్థాల జాతరకు అంతా సిద్ధం



ముస్తాబైన తీర్థాలలోని సంగమేశ్వర ఆలయం

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలం తీర్థాలలోని సంగమేశ్వర స్వామి ఆలయలో నాలుగు రోజుల పాటు జరిగే జాతరకు లక్షలాదిగా భక్తులు తరలిరానుండగా అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇక్కడ మంగళవారం అర్ధరాత్రి 12గంటలకు జాతర ప్రారంభమవుతుంది. జాతరకు ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల భక్తులు తరలివచ్చి గంగాపార్వతీ సమేత సంగమేశ్వరుడిని దర్శించుకుంటారు. ఈమేరకు 500మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించనున్నారు.

వాహనాల దారి మళ్లింపు, పార్కింగ్

- జాతరకు భక్తులు వచ్చే వాహనాలను దారి మళ్లిస్తూ ప్రత్యేక స్థలాల్లో నిలిపేలా ఏర్పాట్లు చేశామని ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్ దత్ వెల్లడించారు. ఈ సందర్భంగా సీపీ వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.
- ఖమ్మం వైపు నుండి వచ్చే వాహనాలు వయా దానవాయిగూడెం, రామన్నపేట, కామంచికల్, మీదుగా చేరుకుని కామంచికల్ మున్నేరు వాగు బ్రిడ్జి రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేసుకోవాలి. ట్రాక్టర్లు, లారీలు కామంచికల్, పాటివారిగూడెం నుండి జాన్ బాద్‌తండా వెళ్లే దారిలో వెళ్లి కామంచికల్ బ్రిడ్జి వద్ద నిలపాలి.
- డోర్నకల్, పాపటపల్లి మీదుగా వచ్చే వాహనాలు కామంచికల్‌కు ముందు చెరువు వద్ద కుడి వైపు జామాయిల్ తోటలో నిలపాలి.
- మద్దివారిగూడెం, మంగళగూడెం వైపు నుండి వచ్చేవారు తీర్థాల గ్రామ ప్రవేశం వద్ద పార్కింగ్ చేసుకోవాలి.
- కురవి, ములకలపల్లి వైపు నుండి ఆటోలు, ట్రాక్టర్లలో వచ్చేవారు ఎం.వెంకటాయపాలెం, గుండాల తండా, మీదుగా తీర్థాలచేరుకోవాలి.
- ఖమ్మంరూరల్ నుండి వచ్చే ద్విచక్రవాహనాలు, కార్లను వయా పల్లెగూడెం, గోళ్లపాడు, మీదుగా ఆకేరు బ్రిడ్జి వరకు అనుమతిస్తారు.
- పల్లెగూడెం మీదుగా వచ్చే ట్రక్కులు, ట్రాలీలు ఎం.వెంకటాయపాలెం మీదుగా గూడురుపాడు, తనగంపాడు, గుండాలతండా మీదుగా చేరుకోవాలి.
- ఖమ్మం పట్టణం నుంచి వచ్చే భక్తులు దర్శనం అనంతరం కామంచికల్ గ్రామపంచాయతీ కార్యాలయం సమీపం నుండి వయా ముత్యాలగూడెం, కోయచెలక, మీదుగా వెళ్లాలి.

జాతరకు ఏర్పాట్లు పూర్తి..

మహాశివరాత్రి ఉత్సవాలకు తీర్థాల సంగమేశ్వర ఆలయం సిద్ధమైంది. భక్తుల కోసం ఆలయ కమిటీ, ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించగా, స్వామిని దర్శించుకునేలా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అంతేకాక ఆలయ ఆవరణలో స్వామి వారి కల్యాణ మండపాన్ని నిర్మించారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్



సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తున్న సిబ్బంది



ఆలయం వద్ద సిద్ధమవుతున్న ఎగ్జిబిషన్

వైరా మేజర్‌కు నీటి నిలిపివేతపై రైతుల ఆగ్రహం



రైతులతో మాట్లాడుతున్న నీటిపారుదల శాఖ అధికారులు

కొణిజర్ల: ఎన్నెస్పీ బోనకల్ బ్రాంచ్ కాల్వ పరిధి వైరా మేజర్‌కు నీటి విడుదల నిలిపివేయడంపై దిద్దుపూడి, పల్లిపాడు, గోపారం రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు సోమవారం బీబీసీ లాక్‌ల వద్ద ఆందోళన నిర్వహించారు. లష్కర్ల ద్వారా విషయం తెలుసుకున్న ఎన్నెస్పీ సీఈ రమేష్, ఈఈ బాబూరావు, డీఈ శిల్ప చేరుకుని వారితో మాట్లాడారు. బీబీసీ ఆయకట్టు చివరి భూములు ఎండిపోతున్నందున అటు వైపు నీరు విడుదల చేస్తున్నామని అధికారులు తెలిపారు. అయితే, తమ పంటలు సైతం ఎండిపోయే దశకు చేరాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంపై అధికారులు సోమవారం రాత్రి నుంచి వైరా మేజర్‌కు నీటిని విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

ఉత్సాహంగా కొనసాగుతున్న టెన్నిస్ టోర్నీ

పోటీలను పరిశీలించిన మంత్రి తుమ్మల



టెన్నిస్ ఆడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం స్పోర్ట్స్: అగ్రశేణి టెన్నిస్ క్రీడాకారులతో ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం కళకళలాడుతోంది. టెన్నిస్‌లో పేరున్న వివిధ రాష్ట్రాల క్రీడాకారులు తమ ర్యాంక్‌ను మరింత మెరుగుపర్చుకునేందుకుగాను చల్లపల్లి రాధమ్మ స్మారక ర్యాంకింగ్ టోర్నీలో పోటీ పడుతున్నారు. సోమవారం వరకు 13మంది క్రీడాకారులు పోటీ నుంచి వైదొలగగా, సింగిల్స్ విభాగంలో విజేతలుగా నిలిచిన వారి వివరాలిలా ఉన్నాయి. ఉదిత్ కామ్‌బోంజ్(హర్యానా) – నిషిత్ నవీన్(కర్ణాటక)పై 6–3, 6–1 తేడాతో విజయం సాధించాడు. అలాగే, రఘునందన్‌బాబు(ఆంధ్రప్రదేశ్) – దర్ష్ అగర్వాల్(తెలంగాణ)పై 7–5, 6–3 స్కోర్‌తో, దేబాసిస్‌సాహో(ఒడిషా) – ముర్తజా ముజుఫూర్ వాలా(తెలంగాణ)పై 6–3, 6–3 తేడాతో, మాచర్ల శశాంక్(తెలంగాణ) – రక్షక్ తరుణ్(తమిళనాడు) పై 0–6, 6–2, 6–2 తేడాతో, సర్‌తక్ గులాటి(పంజాబ్) – వేదాంశ్ ప్రశాంత్(కర్ణాటక)పై 7–6, 6–1 తేడాతో, శాక్‌వ్యామ్(మహారాష్ట్ర) – రామచంద్రారెడ్డి(తెలంగాణ)పై 6–3, 6–0 తేడాతో, రిక్కి చౌదరి(ఢిల్లీ) – త్రిశాంత్‌రెడ్డి(తెలంగాణ)పై 3–6, 6–4, 6–2 తేడాతో నెగ్గారు. అలాగే, ఆదిత్య వర్ధన్ (తెలంగాణ) – మనీష్ బాలజీ(తమిళనాడు)పై 6–2, 6–1 తేడాతో, జితిన్‌నైన్ (హర్యానా) – హర్ష (తెలంగాణ)పై 6–2, 6–1తేడాతో, సందేష్ డి.కురాల్(మహారాష్ట్ర) – ప్రజ్ఞాన్ (తెలంగాణ)పై 6–3, 6–2 తేడాతో, దీపక్(కర్ణాటక) – నీలం దేవర్షిత్(తెలంగాణ)పై 6–4, 6–0 తేడాతో, వన్ష్ బాసిత్ (ఢిల్లీ)– శ్రీవంత్‌రెడ్డి(తెలంగాణ)పై 2–6, 7–5, 6–2 తేడాతో, పుల్లెల శాండిల్య(తెలంగాణ)– అన్‌కిరిష్ ప్రతాప్ అజయ్‌వర్మ(రాజస్థాన్) పై 6–0, 6–0 తేడాతో విజయాలు సాధించారు. కాగా మంగళవారం ప్రీ క్వార్టర్ ఫైనల్స్ జరుగుతాయని రిఫరీ ప్రవీణ్‌నాయక్ తెలిపారు. ఈకార్యక్రమంలో చల్లపల్లి శ్రీనివాస్, డాక్టర్ అనిల్, కాంపాటి సత్యనారాయణ పాల్గొన్నారు. కాగా, పోటీలను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం రాత్రి పరిశీలించి కాసేపు టెన్నిస్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాను క్రీడా హబ్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని తెలిపారు. ఖమ్మం మేయర్ పునుకోల్లు నీరజ, డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ లింకింగ్ విద్యుత్ లైన్ ప్రారంభం

మధిర: మధిర నియోజకవర్గంలోని మధిర, బోనకల్ మండలాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా ఏర్పాటుచేసిన ఇంటర్ లింకింగ్ విద్యుత్ లైన్‌ను సోమవారం ప్రారంభించారు. బోనకల్ మండలంలోని మోటమర్రి టాపింగ్ నుండి మధిర మండలం సిరిపురం సబ్ స్టేషన్ వరకు 2.5 కి.మీ. మేర రూ.25లక్షల వ్యయంతో ఈ లైన్ ఏర్పాటుచేశామని ఖమ్మం ఎస్ఈ సురేందర్ తెలిపారు. తద్వారా బోనకల్, మధిర మండలాల్లోని 132 కే.వీ. సబ్ స్టేషన్లలో విద్యుత్ అంతరాయం ఏర్పడితే పెద్దగోపతి నుండి బోనకల్ మీదుగా సిరిపురం సబ్ స్టేషన్‌కు సరఫరా చేయొచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైరా డీఈ బండి శ్రీనివాసరావు, మధిర ఏడీఈ ఎం.అనురాధ, ఏఈ ఎస్.మైథిలి తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్ లింకింగ్ పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ, ఉద్యోగులు

గుండెపోటుతో డిప్యూటీ సీఎం పీఏ మృతి

నివాళులర్పించిన భట్టి, మంత్రి తుమ్మల



శ్రీనివాసరావు (ఫైల్)

మధిర: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వ్యక్తిగత సహాయకుడు(పీఏ) తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు(51) సోమవారం ఖమ్మంలోని ఆయన నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు. ఖమ్మం ఐసీడీఎస్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ అయిన ఆయన ఆరేళ్ల క్రితం భట్టి వద్ద పీఏగా నియమితులై కొనసాగుతున్నారు. కురవి మండలం సీరోలుకు చెందిన శ్రీనివాసరావు దశాబ్ద కాలంగా ఖమ్మం కరుణగిరి సమీపాన టీఎన్జీవోస్ కాలనీలో స్థిరపడ్డారు. ఖమ్మంలోని భట్టి క్యాంప్ కార్యాలయానికి వెళ్లడానికి సోమవారం ఉదయం శ్రీనివాసరావు సిద్ధమవుతుండగా గుండెపోటుతో కుప్పకూలారు. దీంతో కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆయనకు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. శ్రీనివాసరావు మృతదేహం వద్ద డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, మల్లు నందిని, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావుతో పాటు కాంగ్రెస్ నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు. ఈసందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ శ్రీనివాసరావు నిబద్ధత, నిస్వార్థ సేవలు మరువలేనివని తెలిపారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని వెల్లడించారు.



నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, పక్కన ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే రాందాస్ తదితరులు

ఎన్‌యూపీఈ డివిజన్ కమిటీల ఎన్నిక



శివాజీని సన్మానిస్తున్న నూతన కమిటీల బాధ్యులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం తపాలా డివిజన్ ఎన్‌యూపీఈ(నేషనల్ యూనియన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్) వివిధ డివిజన్లకు ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీలను సోమవారం ప్రకటించారు. ఈమేరకు ఆదివారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఎఫ్‌ఎన్‌పీఓ సెక్రటరీ జనరల్, గ్రూప్ సీ ఆలిండియా జనరల్ సెక్రటరీ వాసిరెడ్డి శివాజీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తపాలా శాఖలో యూనియన్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోనందున జేసీఏ ఆధ్వర్యాన కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. సికింద్రాబాద్ డిప్యూటీ సూపరింటెండెంట్ బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఎన్‌యూపీఈ గ్రూప్ సీ ఖమ్మం తపాలా డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా సీహెచ్ ఎస్‌వీబీ.కుమార్, బి.హుస్సేన్, కోశాధికారిగా పమ్మి వెంకటేశ్వరరావు, పోస్టుమెన్ అండ్ ఎంటీఎస్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్ఎల్.నర్సింహారావు, జాటోత్ కిరణ్, కోశాధికారిగా కె.నాగమ్మ, ఎన్‌యూజీడీఎస్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులుగా కె.గోవిందరావు, ఎం.రాంప్రసాద్, కోశాధికారిగా వి.శ్రీనివాసరావు ఎన్నియ్యారని తెలిపారు.

టీజేఎస్ మండల కమిటీల నియామకం

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ జనసమితి(టీజేఎస్) ఖమ్మం నగర కమిటీతో పాటు 13 మండలాలకు అధ్యక్ష, కార్యదర్శులను నియమించినట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.కే.సర్దార్ హుస్సేన్, భట్టు రాజేందర్ నాయక్ తెలిపారు. ఖమ్మంలో సోమవారం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ గోపగాని శంకరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఈ నియామకాలను ప్రకటించారు. ఖమ్మం నగర అధ్యక్ష, కార్యదర్శులుగా బెల్లంకొండ నాగేశ్వరావు, ఎస్.కే.మహబూబ్‌పాషా, రఘునాథపాలెంకు రాగం పాపారావు యాదవ్, జి.వెంకటేశ్వర్లు, ఖమ్మం రూరల్‌కు గద్దం సంతోష్‌రెడ్డి, గాలి సురేష్, తిరుమలాయపాలెంకు దొడ్డా శ్రీనివాసరెడ్డి, మెట్టు కేశవ్, నేలకొండపల్లికి వాసం ప్రసాద్, జంగా సాయికుమార్, జూలూరుపాడుకు రాసబంటి వెంకటనర్సయ్య, బొర్రా ఉపేందర్, కొణిజర్లకు దావా వెంకటేశ్వర్లు, తాళ్ల వీరయ్య, కారేపల్లికి మద్దెల వెంకటేశ్వర్లు, నాగేశ్వరావు, ఏన్కూరుకు లేళ్ల నర్సింహరావు, వెంగళ మోహన్ రావు, పెనుబల్లికి మిద్దె చలపతిరావు, మరీదు చంద్రశేఖర్ను నియమించారు. అలాగే, బోనకల్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బీరెల్లి వాసు, తాళ్లూరి శ్రీనివాసరావు, చింతకానికి తిప్పర్తి రామాచారి, నాగుల్‌మీరా, ముదిగొండకు సూరపల్లి సీతారాములు, పరికపల్లి యల్లయ్యగౌడ్, మధిర మండల అధ్యక్ష, కార్యదర్శులుగా సీహెచ్.నర్సింహరావు, పి.వెంకటేశ్వర్లును నియమించినట్లు తెలిపారు.

పంటలకు మద్దతు ధర కోసం చట్టం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న హేమంతరావు

వైరా: పంటలకు మద్దతు ధర దక్కేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టం తీసుకురావాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. వచ్చేనెల 20న తెలంగాణ రైతు సంఘం జిల్లా మహాసభలు జరగనున్న నేపథ్యాన సోమవారం వైరాలో ఆహ్వాన సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన రెండు నల్లచట్టాలపై రైతు సంఘాల సంయుక్త సంఘం పోరాడడంతో రద్దు చేసిందన్నారు. కానీ అవే చట్టాలను మరో రూపంలో అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని, తద్వారా కార్పొరేట్ సంస్థలకు వ్యవసాయ రంగాన్ని కట్టబెట్టే కుట్ర దాగి ఉందని ఆరోపించారు. కాగా, తెలంగాణలో అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేశామని ప్రభుత్వం చెబుతున్నా 60 శాతం మందికి జరగలేదని తెలిపారు. జిల్లాలో సీతారామ ప్రాజెక్టును పూర్తిచేసేలా వచ్చే బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించడానికి జిల్లా మంత్రులు చొరవ చూపాలన్నారు. రైతుసంఘం మహాసభల్లో రైతుల సమస్యల ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని హేమంతరావు తెలిపారు. రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, నాయకులు అడపా రామకోటయ్య, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, గోపాలరావు, వెంకటరెడ్డి, ముత్తయ్య, రామకృష్ణ, వెంకటరత్నం, రవి, పవన్, ఆనందరావు, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

వైల్డ్‌లైఫ్ బోర్డు సమావేశంలో ఎమ్మెల్యేలు



వైల్డ్‌లైఫ్ సమావేశంలో మంత్రితో ఎమ్మెల్యేలు పాయం, రాందాస్

మణుగూరు టౌన్: హైదరాబాద్‌లోని సచివాలయంలో అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన సోమవారం జరిగిన తెలంగాణ బోర్డు వైల్డ్ లైఫ్‌బోర్డు సమావేశంలో బోర్డు సభ్యులైన పినపాక, వైరా ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, మాలోతు రాందాస్‌నాయక్ పాల్గొన్నారు. ఈసందర్భంగా పినపాక నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల్లో అభివృద్ధి పనులకు అటవీ అనుమతులు ఇప్పించాలని పాయం కోరారు. కరకగూడెం మండలం భట్టుపల్లి క్రాస్ నుంచి మామకన్ను వయా ఆళ్లపల్లి బీటీ రోడ్డు, గుండాల– రంగాపూర్ వయా దామరతోగు సాయిన్నపల్లి మీదుగా రోడ్డు, అశ్వాపురం మండలం మొండికుంట–మామిళ్లవాయి రోడ్డుకు అనుమతులు ఇప్పించాలని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే, రేగులగండి, తుమ్మలచెరువు ప్రాంతాల్లో ఎకో టూరిజం అభివృద్ధి, అర్హులకు పోడు పట్టాలు, పట్టాలు అందుకున్న వారికి బోరు, మోటార్, కరెంట్ లైన్లకు అనుమతులపై చర్చించగా బోర్డు సమావేశంలో తీర్మానం చేయించినట్లు ఆయన వెల్లడించారు.

అట్రాసిటీ కేసు నమోదు

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరుకు చెందిన షేక్ జాన్‌బీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. గత ఏడాది డిసెంబర్ 2వ తేదీన జాన్‌బీ, హరిచందన పాతకక్షలతో పరస్పరం దాడి చేసుకున్నారు. ఈసమయాన హరిచందన భర్త వంశీకృష్ణ వీడియో తీస్తుండగా ఆయనను జాన్‌బీ కులం పేరుతో దూషించింది. దీంతో వంశీకృష్ణ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు జాన్‌బీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి

తల్లాడ: రెడ్డిగూడెం క్రాస్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన మూకర ఎర్రయ్య(76) ఆదివారం రాత్రి రెడ్డిగూడెంలోని బంధువుల ఇంటికి వెళ్లి సోమవారం తెల్లవారుజామున కాలినడకన తిరిగి వస్తున్నాడు. ఈక్రమంలో జాతీయ రహదారిపై అతి వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఆయనను ఢీకొట్టగా తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమత్తం తరలించి కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ జీవీయర్ తెలిపారు.